సాక్షి
నారాయణపేట
శుక్రవారం । 6 । జూన్ । 2025



చాంపియన్ హైదరాబాద్
బాస్కెట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ పురుషుల, మహిళల జట్లు చాంపియన్లుగా నిలిచాయి.
వివరాలు 10లో ▸



24.728 మి.యూ.,
జూరాల ఎగువ, దిగువ కేంద్రాల్లో 24.728 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టారు.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.8 /22.4
వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి



ఊట్కూరు: వయసు పైబడివారు ఆహారం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ జయచంద్రమోహన్ అన్నారు. మండలంలోని పగిడిమారిలో గురువారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ క్యాంపులో ఉచితంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహించి పలువురికి సూచనలతో పాటు మందులను పంపిణీ చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు ఆహార నియమాలు పాటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రకాష్, డాక్టర్ సంతోషి, వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, శ్రీదర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిలో 475 దరఖాస్తులకు మోక్షం

మద్దూరు: భూభారతి పైలెట్ మండలమైన మద్దూరులో మొత్తం 475 దరఖాస్తులకు మోక్షం లభించింది. ఏప్రిల్ 28 వరకు మండలంలోని 30 గ్రామాల్లో భూభారతిలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలపై ఆయా గ్రామల్లో ప్రజల నుంచి మొత్తం 1341 అర్జీలు రాగా.. వాటిని కలెక్టర్, ఇద్దరు అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీఓ, ఆరుగురు తహసీల్దార్లు వాటిని పరిశీలించారు. వీటిలో 475 దరఖాస్తుల భూ సమస్యలను పరిష్కరించారు. వివిధ కారణాలతో 753 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు సమాచారం. 113 సాదాబైనామాలు కోర్టులో కేసులు ఉండడం, తిరస్కరణకు గురైన వాటిలో 192 వివిధ దశల్లో ఉన్నట్లు సమాచారం.

ఎంపీ మల్లురవిపై అధిష్టానానికి ఫిర్యాదు



అలంపూర్: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిపై మాజీ ఎమ్మెల్యే, అలంపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు పలు పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నెల 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీ మల్లు రవి జిల్లాలో పర్యటించారు. ఈక్రమంలో కాంగ్రెస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరిత ఇంటికి ఎంపీతోపాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వెళ్లడంపై అలంపూర్ కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా మల్లు రవి బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే అలంపూర్ క్షేత్రానికి ఆయన విచ్చేయగా.. సొంత పార్టీ నేతలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించారు. మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజ్‌తోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఐటీఐలో ప్రవేశాలు

వనపర్తి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో 2025–26, 27 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత ప్రవేశాలకు ఉపాధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీ చేశామని, సీట్ల భర్తీకి అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21 వరకు అవకాశం ఉందని, ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 79953 35372, 98492 44030లను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి: జిల్లాలోని గిరిజన బాల, బాలికల నుంచి బెస్ట్ అవైలేబుల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన అభివృద్ధి శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 10 ఖాళీలకు గాను 3, 5, 8 తరగతుల విద్యార్థులు అర్హులని, వనపర్తి జిల్లా, గిరిజన తెగలకు చెందిన (లంబాడీ, ఎరుకల వారు) విద్యార్థులు ధ్రువపత్రాలతో ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతం వారు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత వారి ఆదాయం రూ.2 లక్షలు మించకూడదని, దరఖాస్తు ఫారాలు కలెక్టరేట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

విత్తన ఎంపికే కీలకం

'సాక్షి' ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్

- లైసెన్స్‌డ్ డీలర్లతోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- పదును, అదును చూసి విత్తుకోవాలి
- సేంద్రియ ఎరువులు, పంట మార్పుతోనే దిగుబడులు
- నకిలీ విత్తనాల కట్టడికి 13 బృందాలతో నిఘా
- బీజీ 3 పత్తి విత్తనాలతో క్యాన్సర్ ముప్పు



నారాయణపేట: 'వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ఎంతో కీలకం. లైసెన్స్‌డ్ డీలర్లతోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్రతి కొనుగోలుకు సంబంధించి రశీదు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు విత్తితే నష్టమే మిగులుతుంది. జూలై 15 వరకు విత్తనాలు విత్తేందుకు అనువైన సమయం. సేంద్రియ ఎరువులు వాడడం, పంటల మార్పుతో అధిక దిగుబడులు పొందవచ్చు. మరో ముఖ్య విషయం.. బీజీ 3 పత్తి విత్తనాలు విత్తితే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుందని జాగ్రత్తగా ఉండాలి'.. అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్ అన్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన 'సాక్షి' ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. విత్తన ఎంపిక, వాడకం, విత్తనశుద్ధి, ఎరువులు, మందుల వాడకం, ఏయే కార్తెల్లో పంటలు, భూముల్లో ఏ రకమైన పంటలు వేయాలి.. ఇలా పలు అంశాలపై రైతులకు డీఏఓ సలహాలు, సూచనలు చేశారు.

సాక్షి ఫోన్ ఇన్

■ ప్రశ్న: పత్తిలో ఏ రకాలు వేసుకోవచ్చు ?
– మహేశ్‌గౌడ్, బిజ్వార్

■ డీఏఓ: వివిధ కంపెనీలకు చెందిన హైబ్రిడ్ పత్తి విత్తనాలు మార్కెట్‌లో చాలా ఉన్నాయి. నేలలో సారం, యాజమాన్య పద్ధతులను బట్టి పంటలో దిగుబడులుంటాయి. దుక్కి చేసే సమయంలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, ఎకరానికి 50 కిలోల డీఏపీ ఆఖరి దుక్కిలో వేయాలి. కలుపు నివారణకు విత్తిన 48 గంటలలోపు పెండిమిథిలిన్ లీటర్ల 200 లీటర్ల నీటిలో పిచికారీ తర్వాత కలుపు 2–4 ఆకుల వయస్సులో హిట్‌వీడ్ మాక్స్, టార్గ సూపర్ మందు వాడాలి.

■ ప్రశ్న: పత్తి విత్తన కొనుగోలులో ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?
– రవీంద్రారెడ్డి, వడ్వాట్

■ డీఏఓ: జీఈఏసీ అప్రూవల్‌తో పాటు విత్తనాల ప్యాకెట్‌పై సుటేబుల్ ఫర్ తెలంగాణ లాట్ నంబర్ ఉండాలి. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. రశీదులు తప్పక తీసుకోవాలి. పంట కాలం పూర్తి అయ్యే వరకు ఆ విత్తనాల ప్యాకెట్లను, రశీదును భద్రపరచుకోవాలి.

■ ప్రశ్న: బీజీ 3 పత్తి విత్తనాలు వాడితే ఏమవుతుంది?
– బాల్‌రాం, కోటకొండ

■ డీఏఓ: నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఇస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లాలో 13 బృందాలను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ దృష్టి సారిస్తున్నాం. లూజ్ విత్తనాలు అమ్మితే వాటిని కొనుగోలు చేయవద్దు. బీజీ 3 విత్తనాలు వాడితే పొలం పాడవుతుంది. కలుపు నివారణకు వాడే గడ్డి మందులతో పంటంతా విషపూరితంగా మారుతుంది. పత్తి ఏరిన వారికి, దుక్కిలో వాడే పశువులు, తిరిగే మనుషులు సైతం క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది. బీటీ 2 విత్తనాలు మాత్రమే వాడాలి.

■ ప్రశ్న: సన్న రకాలు ఎప్పటి వరకు విత్తుకోవచ్చు ?
– నారాయణరెడ్డి, కొత్తపల్లి

■ డీఏఓ: సన్న రకాల్లో దీర్ఘకాల, స్వల్ప కాలిక వరి ధాన్యం పంటలను సాగు చేసుకోవచ్చు. అందులో దీర్ఘకాలిక పంటలను జూన్ 15 వరకు నారు పోసుకోవాలి. స్వల్పకాలిక రకాలను జూలై 15 వరకు నారు పోసుకోవచ్చు.

■ ప్రశ్న: ఆముదం, పొద్దుతిరుగుడు విత్తనాలు ఏవి వేయాలి ?
– శ్రీహరి, కానుకుర్తి

■ డీఏఓ: జ్వాల, జ్యోతి, కిరణ్, పీసీఎస్ 262, పీసీహెచ్111, డీసీహెచ్ 177.. పొద్దుతిరుగుడులో ఏపీఎస్‌హెచ్ 11 కేబీఎస్‌హెచ్1, ఎస్‌డీఎస్‌హెచ్1, డీఆర్‌ఎస్‌హెచ్1 వేసుకోవచ్చు.

■ ప్రశ్న: జీలుగా సాగు చేయడం ఎలా ?
– నర్సింహారెడ్డి, అడవి సత్యారం

■ డీఏఓ: జీలుగ విత్తనాలతో పంటకు కావాల్సిన సారం వస్తుంది. జీలుగా సాగు చేసిన 25 నుంచి 45 రోజుల వ్యవధిలో పూత దశకు వస్తుంది. జీలుగ విత్తనాలు సబ్సిడీతో రైతులకు అందిస్తున్నాం. జీలుగ వేయడంతో చౌడు నెలలు సత్వ అయ్యేందుకు అవకాశం ఉంటుంది. మూడేళ్ల పాటు జీలుగా ప్రతి ఏడాది వరి నాటే ముందు వేసి కలియదున్నాలి.

■ ప్రశ్న: నువ్వులు, మినుములు, ఉలవలు ఏ రకాల విత్తనాలు వేసుకోవాలి ? – వెంకట్, దామరగిద్ద

■ డీఏఓ: నువ్వుల్లో శ్వేత, రాజేశ్వరి, ఎలమంచిలి 66, చందన, జేసీఎస్ 9428 (హిమ), మినుములో ఎల్‌బీజీ 623, ఎల్‌బీజీ 762, ఎల్‌బీజీ 20, పీయూ 31, ఎంబీజీ 209, ఎల్‌జీబీ 787, డబ్ల్యూజీ 26, ఉలవలు సిహెచ్‌సీ 9, పీడీఎం 1, బీజెడ్‌ఎం1, పాలెం 1, పాలెం 2 , పిహెచ్‌జీ 62, పీఆర్‌హెచ్‌జీ 19 వేసుకోవచ్చు.

■ ప్రశ్న: కలుపు నివారణకు ఎలాంటి మందులు వేయాలి ?
– రాఘవేందర్, ధన్వాడ

■ డీఏఓ: కంది, పత్తి ఇతర పంటలు వేసి 48 గంటల్లో పెండిమిథాలిన ఎకరానికి లీటర్ చొప్పున పిచికారీ చేయాలి. ఏఈఓలను సంప్రదించిన తర్వాతనే మందులు, ఎరువులు వాడాలి. కందిలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడిని కిలో విత్తనాలకు 10 గ్రాముల విత్తనశుద్ధి చేయాలి.

■ ప్రశ్న: ఎర్ర చలక, నల్ల రేగడి నేలల్లో ఏ పంటలు వేసుకోవచ్చు ?
– వెంకటప్ప, ఊట్కూర్

■ డీఏఓ: ఎర్ర చలక నేలల్లో నీటి నిల్వ ఉండే సామర్థ్యం తక్కువ. ఎర్ర చలకలను దుక్కి దున్నడం, విత్తడం, అంతర కృషి చేయడంతో నీటి ఒరవడిని ఎక్కడికక్కడే అరికట్టి ఎక్కువ నీటిని భూమిలోకి ఇంకింపజేయాలి. ఈ నేలల్లో వేరుశనగ పంట బాగా పండుతుంది. ఇక నల్ల రేగడి నేలల్లో పత్తి, జొన్న పంటలు పండిస్తే అధిక దిగుబడి వస్తుంది.

■ ప్రశ్న: అలసంద, సజ్జ, కొర్ర, జొన్నలో ఏ విత్తనాలు వేయవచ్చు ?
– రాజు, నర్వ

■ డీఏఓ: అలసందలో జీసీ3, వి240, సి152 విత్తనాలు, జొన్నలో సీఎస్‌హెచ్ 25, సీఎస్‌హెచ్ 16, సీఎస్‌హెచ్ 30, పీఎస్‌వీ 56, సీఎస్‌వీ 31, సీఎస్‌వీ 27 విత్తనాలు, సజ్జలో ఐసీఎంవీ 221, ఐసీటీపీ 8203, పీహెచ్‌వీ 3, కొర్రలో సూర్యనంది, ఎస్‌ఐఏ 3156, ఎస్‌ఐఏ 3085 విత్తనాలు వేసుకోవచ్చు.

■ ప్రశ్న: కంది, పెసర ఏ రకాలు అనువైనవి ?
– శ్రీనివాస్, బాపన్‌పల్లి

■ డీఏఓ: కందిలో కొలంబో, డబ్ల్యూఆర్‌జీ 93 (తెలంగాణ కంది), పీఆర్‌జీ 100, పీఆర్‌జీ 158, పీఆర్‌జీ 175, మారుతి, ఆర్‌జీపీ 1, అలాగే పెసరలో యాదాద్రి (డబ్ల్యూజీజీ42), టీఎం 9602, ఎంజీజీ 295, ఎంజీజీ 347 విత్తుకోవచ్చు. తెల్ల కందులు విత్తితే ట్రైకోడర్మ వికోతో విత్తన శుద్ధి చేసుకోవాలి. పీఆర్‌జీ 176/పింక్ కందులు, దుర్గ, ఆశ రకాలను నీటి పారుదల కింద విత్తుకోవాలి.

■ ప్రశ్న: వరిలో ఏ సన్న రకాలకు బోనస్ వస్తుంది ?
– శ్రీనివాస్‌రెడ్డి, కొత్తపల్లి

■ డీఏఓ: వరి ధాన్యంలో 33 సన్నరకాలకు ప్రభుత్వం నుంచి బోనస్ వర్తిస్తుంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల సన్న రకాల వరి ధాన్యం పండిస్తారు. బోనస్ వచ్చే సన్నరకాల విషయానికి వస్తే.. వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్ 14), వరంగల్ సన్నాలు (డబ్ల్యూఎల్ 32100), జగిత్యాల్ మసూరి (జెజీఎల్11470), సిద్ధి (డబ్ల్యూజీఎల్44), కంపసాగర్ వరి 1 (కేపీఎస్2874), సాంబ మసూరి (బీపీటి 5204), జగిత్యాల్‌వరి 3 (జేజీఎల్ 27356), జగిత్యాల్ వరి 2 (జెజీఎల్ 28545), పొలాసప్రభ (జేజీఎల్ 384), వరంగల్ వరి 2 (డబ్ల్యూజీఎల్ 962), ఎంటీయూ 1271, రాజేంద్రనగర్ వరి 4 (ఆర్‌ఎన్‌ఆర్ 21278), కూనరం వరి 1 (కేఎన్‌ఎం 733), జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798), కృష్ణ (ఆర్‌ఎన్‌ఆర్ 2458), మానేరు సోనా (జేజీల్ 3828), తెలంగాణసోనా (ఆర్‌ఎన్‌ఆర్ 15048), వరంగల్ వరి 1119, కూనరం వరి 2 (కేఎం 1638), జగిత్యాల సాంబ (జేజేఎల్3844), అంజన (జేజీఎల్ 11118), సోమ్‌నాథ్ (డబ్ల్యూజీఎల్ 347), ఆన్‌ఆర్‌ఆర్ 31479 (పీఆర్‌సీ), కేపీఎస్ 6251 (పీఆర్‌సీ), కేపీఎస్ 6251 (పీఆర్‌సీ), జేజీఎల్ 33124 (పీఆర్‌సీ), నెల్లూరు మసూరి (ఎన్‌ఎల్‌ఆర్ 34449), ప్రత్యుమ్న (జేజీఎల్ 17004), సుగంధ సాంబ (ఆర్‌ఎన్‌ఆర్ 2465), శోభిని (ఆర్‌ఎన్‌ఆర్ 2354), హెచ్‌ఎంటీ సోనా , మార్జేరు మసూరి (ఎంటీయూ 1262), మార్జేరు సాంబ (ఎంటీయూ 1224).

■ ప్రశ్న: కూరగాయలు, పండ్ల తోటలకు అనువైన పొలాలు తెలపండి?
– రంగారెడ్డి, అప్పిరెడ్డిపల్లి

■ డీఏఓ: ఎర్ర చలక నెలలు అనుకూలం. జిల్లాలో దామరగిద్ది, మద్దూర్, కోస్గి, నారాయణపేట మండలాలతో పాటు మిగతా మండలాల్లో సైతం కూరగాయలు, పండ్ల తోటలను పండించవచ్చు. బొప్పాయి, మామిడి, బత్తాయి తదితర పండ్ల తోటలతో పాటు అన్ని కూరగాయలు పండించవచ్చు.

అలజడి.. ఆందోళన



నిర్మానుష్యంగా మారిన పెద్ద ధన్వాడ గ్రామం

వ్యవసాయం.. పాడి పశుపోషణ.. కూలీ పనులు.. ఇవే వారి ప్రధాన జీవనోపాధి. రెక్కల కష్టాన్ని నమ్ముకొని.. వచ్చిన కొంత డబ్బుతో కాలం గడిపేవారు ఆ గ్రామస్తుల జీవితం ఒక్కరోజులోనే తలకిందులైంది. పోలీస్‌స్టేషన్లు.. కేసులు.. జైలు.. ఇలా మారింది. ఇథనాల్ ఫ్యాక్టరీ చిచ్చు దాదాపు 12 గ్రామాల్లో అలజడి.. వందల కుటుంబాల్లో భయాందోళన సృష్టిస్తోంది.
– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/రాజోళి

- ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్త ఘటనలతో గ్రామాల్లో అలజడి
- అరెస్టులతో 12 గ్రామాల్లో ఆందోళన
- 41 మందిపై కేసు.. 12 మంది రిమాండ్
- ఘటనపై మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు

జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారని తెలిసినప్పటి నుంచి ఆ చుట్టు పక్కల 12 గ్రామాల ప్రజల్లో కునుకులేకుండా పోయింది. తాజాగా బుధవారం ఫ్యాక్టరీ వద్ద జరిగిన దాడులు, నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో పెద్ద ధన్వాడతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజల్లో కూడా ఆందోళన మొదలైంది. రైతులు చేసిన దాడికి సంబంధించి కంపెనీకి చెందిన సీఏఓ మంజునాథ్ రాజోళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడుల్లో తమ సిబ్బంది పలువురికి గాయాలు కావడంతో పాటు కంపెనీకి చెందిన వాహనాలు, సామగ్రి ధ్వంసమైనట్లు అందులో పేర్కొన్నారు. దాడులకు దిగిన 41 మందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు మేరకు పోలీసులు 41 మందిపై కేసులు నమోదు చేయగా.. ఇందులో జనం సాక్షి పత్రిక ఎడిటర్ రహమాన్‌తో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా సబ్ జైలర్ నాగరాజు ఉండడం చర్చనీయాంశంగా మారింది. దాడుల సమయంలో వారు ఘటన స్థలంలో లేరని.. అయినా వీరి పేరు చేర్చడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై రాజోళి ఎస్సై జగదీష్‌ని సంప్రదించగా.. దాడులకు ప్రేరేపించింది రహమాన్, నాగరాజు అని, మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మానవపాడు మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కేఎంఎస్ శ్రావణ్‌పై కేసు నమోదైంది. 191(2), 191(3), 329(3), 329(4), 324(5), 126(1), 326(జీ), 115(2), 118(1), 121(1), 132, 126(2), 109, 61(2), 199బీఎన్ఎస్, 0 సీఎల్ఏఏ–2013 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా.. కేసులు నమోదైన వారిలో 12 మందిని పోలీసులు గద్వాల జిల్లా కోర్టులో హాజరుపర్చగా.. వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. రిమాండ్‌కు తరలించిన వారిలో పెద్ద ధన్వాడకు చెందిన రైతులు నర్సింహులు, కె.నర్సింహులు, భరత్ కుమార్, చిన్న నాగేంద్ర, నల్లబోతుల కాటన్, శివ గౌడ్, సూర్యప్రకాష్, భీమన్న, మనోహర్, యేసన్న, నాగేంద్రంతోపాటు చిన్న ధన్వాడకు చెందిన పరుష రాముడు ఉన్నారు. జడ్జి తీర్పు అనంతరం పోలీసులు వీరిని ప్రత్యేక వాహనంలో మహబూబ్‌నగర్‌లోని జిల్లా జైలుకు తరలించారు.

బిక్కు బిక్కుమంటూ..

బుధవారం ఘటన అనంతరం రాత్రి పోలీసులు అరెస్టులు మొద లు పెట్టడంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. గ్రామంతో పాటు ఇటు చిన్నధన్వాడ గ్రామస్తుల్లో కూడా ఆందోళన మొదలైంది. ఘటన జరుగుతున్న సమయంలో పోలీసులు తీసిన వీడియోల ఆధారంగా అరెస్టులు ఉంటాయని తెలియడంతో, మామూలుగా ఘటనా స్థలి దగ్గరకు వెళ్లిన వారు కూడా ఆందోళన చెందుతున్నా రు. వీరితో పాటు అదే ప్రాంతంలో ఫ్యాక్టరీ పక్కనే తమ పొలాలు ఉన్న వారు కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నారు. వారు కూడా తమపై ఏదైనా చర్యలుంటాయనే ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తమ సాటి రైతులపై కేసులు నమోదయ్యాయని తెలిసి భయభ్రాంతులకు గురవుతున్న రైతులు ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీలో కేసు నమోదు

ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన రైతులపై దాడి చేయడం తగదని.. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది రామారావు ఇమ్మానేని గురువారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)లో పిటిషన్ దాఖలు చేశారు. నిరసన తెలుపుతున్న రైతులపై అక్రమంగా కేసులు పెట్టి తీవ్రంగా కొట్టారని.. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుని అడ్డుకోవడం రైతుల ప్రాథమిక హక్కు అని.. ఓ మైనర్‌పై కేసులు పెట్టారని అందులో పేర్కొన్నారు. రాజోళి ఎస్సై జగదీశ్వర్‌తో పాటు గాయత్రి ఇండస్ట్రీస్ అండ్ రెన్యువేబుల్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా పోలీస్ హింసలో గాయపడిన రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పిటిషన్‌ను స్వీకరించిన కమిషన్ 13030/ ఐఎన్/2025 నంబర్‌తో కేసు నమోదు చేసింది.

■ కాగా.. ఫ్యాక్టరీకి సంబంధించిన వ్యక్తులు దాడిలో తాము గాయపడ్డామని పెద్ద ధన్వాడకు చెందిన మరియమ్మ, కుర్వ క్రిష్ణ, కుర్వ లింగన్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అక్రమ కేసులతో భయపెడుతున్నారు



ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించవద్దని 12 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్న కూడా బలవంతంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనుకోవడం అవివేకం. దీన్ని నిరసిస్తున్న క్రమంలో చోటు చేసుకున్న ఉద్రిక్తతల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశామంటున్నారు. ఆ కేసులు వెంటనే ఎత్తివేయాలి. అమాయక రైతులను జైలుకు పంపి వారి జీవితాలతో ఆడుకోవడం సరికాదు.
– శ్రీనువాసులు, బీఆర్‌ఎస్ నాయకుడు, రాజోళి

పొలం వద్దకు వెళ్లి అరెస్టు చేశారు..



పొలంలో బోర్ మోటార్ ఆన్ చేసి వస్తానని చెప్పిన మా బాబును పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. పని చేసుకుని జీవించే మా ఇంట్లో వాళ్లను ఇలా అరెస్టు చేస్తే మేము బతికేది ఎలా. వెంటనే మా బాబు చిన్న నాగేంద్రంను వదిలిపెట్టాలి.
– నర్సమ్మ, చిన్న నాగేంద్రం తల్లి

ఆధారాలు ఉంటేనే కేసులు



గ్రామస్తులు మమ్మల్ని లెక్కచేయకుండా వందలాదిగా ఫ్యాక్టరీ దగ్గర ఉన్న వాహనాలను ధ్వంసం చేసి, వ్యక్తుల పై కూడా దాడులు చేసే ప్రయత్నం చేశారు. వారిని ఆపే ప్రయత్నంలో పోలీసులకు కూడా గాయాలయ్యాయి. దాడులకు సంబంధించి ఆధారాలను చూసే కేసులు నమోదు చేస్తున్నాం. వారు చేస్తున్న నేరం తీవ్రతను బట్టే సెక్షన్లను పెడుతున్నాం. అమాయక రైతులు, దాడుల్లో పాల్గొనని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– జగదీశ్, ఎస్‌ఐ రాజోళి

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌తో కొత్త వంగడాలు



పాథర్చేడ్ రైతువేదికలో ఆముదం విత్తనాలను రైతులకు అందిస్తున్న ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు

నర్వ: కేంద్ర ప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా కొత్త వంగడాలను రైతులకు అందిస్తుందని ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్‌డీ. ప్రసాద్ అన్నారు. గురువారం పాథర్చేడ్‌లో ఐసీఏఆర్, ఐఐఓఆర్, కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) ఆధ్వర్యంలో నూనెగింజల పంటల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మంది రైతులకు 700 జిల్లాల్లో ప్రత్యేక్ష సంభాషణ ద్వారా నూతన సాంకేతికత, ఉత్పాదకాలు, కొత్త వంగడాలపై అవగాహన కల్పిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకొచ్చిందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులు, మట్టి పరీక్షల కార్డులను రైతులకు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సైంటిస్టులు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా దేశంలో నూనెగింజల వాడకం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో నూనెగింజల ఉత్పత్తిని బాగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆముదం పంట సాగును బాగా విస్తరించేందుకు తీసుకోవాల్సిన అవసరం, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎప్పుడు ఒకే పంట కాకుండా పంటల మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం రైతులకు ఐసీహెచ్–5 అనే ఆముదం విత్తనాలను ఉచితంగా రైతులకు అందించారు. కార్యక్రమంలో సైంటిస్టులు సురేష్, రాజేందర్‌రెడ్డి, నర్వ ఏఓ అఖిలారెడ్డి, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- జడ్చర్ల పరిధిలో 16, దేవరకద్ర పరిధిలో 8 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన
- మరో రెండు 132/33 కేవీ సబ్‌స్టేషన్లకు శ్రీకారం
- నేడు మూసాపేట, నవాబుపేటలో మల్లు భట్టి విక్రమార్క పర్యటన





నవాబుపేటలో సభ స్థలం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

జడ్చర్ల/అడ్డాకుల/నవాబుపేట: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట, జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబుపేటలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూసాపేటలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర, నవాబుపేటలో అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సభ ఏర్పాట్లను పరిశీలించారు. జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి రూ.108 కోట్ల వ్యయంతో కొత్తగా 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 16, నవాబుపేటలో కొత్తగా 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. కాగా.. దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట మండలంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు మరో ఎనిమిది సబ్‌స్టేషన్లకు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మూసాపేట సభలో మైనార్టీ కార్పోరేషన్ ద్వారా మంజూరైన కుట్టు మిషన్లను లబ్ధిదారులకు అందజేయడంతో పాటు రైతులకు మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేస్తారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటన ఇలా:

శుక్రవారం ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో మూసాపేటకు రానున్నారు. 12 గంటల వరకు అక్కడే పలు సబ్‌స్టేషన్లకు సంబంధించి శంకుస్థాపన చేయడంతో పాటు అధికారులు, నాయకులను కలుస్తారు. 12 నుంచి ఒంటి గంట వరకు బహిరంగసభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు మూసాపేట నుంచి నవాబుపేటకు బయల్దేరుతారు. అక్కడ 17 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపనలు చేయడంతో పాటు అధికారులతో సమావేశం అవుతారు. సాయంత్రం 4.15 నుంచి 5 గంటలకు నవాబుపేటలో బహిరంగసభలో పాల్గొంటారు

■ డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క సభ ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పరిశీలించారు. నవాబుపేట సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లింగం, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, తదితరులు ఉన్నారు.

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జ లాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగులకు గా ను 1,017 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో రామన్‌పాడులోని కుడి, ఎడమ కాల్వల ద్వారా 12, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూ సెక్కులు వదిలినట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

శిక్షణ.. సాధన


వాలీబాల్ శిక్షణలో విద్యార్థులు

పాలమూరు ప్రధాన స్టేడియంలో పలు క్రీడల్లో శిక్షణ

- 200కుపైగా విద్యార్థులు హాజరు
- నేటితో ముగియనున్న శిబిరాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరులోని ప్రధాన స్టేడియానికి ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ స్టేడియం ఎన్నో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికైంది. వేసవి వచ్చిందంటే చాలు ఈ స్టేడియంలో పలు రకాల క్రీడల్లో శిక్షణనిస్తారు. ఈ ఏడాది కూడా జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో గత నెల 1వ తేదీన శిక్షణ శిబిరాలు ప్రారంభించగా.. జూన్ 6(శుక్రవారం)తో ముగియనున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు సంబంధించిన వెబ్‌సైట్ ద్వారా క్రీడాకారుల వివరాల నమోదుతో పాటు నామమాత్రపు ఫీజు వసూలు చేశారు. ఫుట్‌బాల్ శిక్షణకు రూ.300, హ్యాండ్‌బాల్‌కు రూ.100, అథ్లెటిక్స్‌కు రూ.400, వాలీబాల్‌కు రూ.100, బాస్కెట్‌బాల్‌కు రూ.400, ఆర్చరీకి రూ.200, చెస్‌కు రూ.300, బ్యాడ్మింటన్‌కు రూ.వెయ్యిగా నిర్ణయించారు. సుమారు 200కిపైగా విద్యార్థులు, యువత ప్రత్యేక శిక్షణకు హాజరయ్యారు. ఉదయం 6 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇచ్చారు. అలాగే కబడ్డీ, యోగా శిబిరాలు సైతం నిర్వహించారు.


అథ్లెటిక్స్ శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు..


స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపికకు వేసవి శిబిరంలో అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్నా. సునీల్ సార్ చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు. పెద్దయ్యాక క్రీడల్లో రాణించాలని ఉంది.
– ప్రేమ్‌కుమార్, మహబూబ్‌నగర్

మొదటిసారి హాజరు..


హ్యాండ్‌బాల్ శిక్షణకు మొదటిసారి వచ్చాను. చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు. రోజు మైదానానికి వచ్చి శిక్షణ తీసుకుంటా.
– సత్య అజిత్, మహబూబ్‌నగర్

ప్రతిభ చాటేందుకు..

వేసవి శిబిరాలు ప్రతిభ కనబర్చేందుకు వేదికలా ఉపయోగపడుతున్నాయి. గతంలో శిక్షణలో పాల్గొన్న చాలామంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి వారికి నిరంతరం శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలో ప్రవేశాల కోసం తల్లిదండ్రులు తమ చిన్నారులను వేసవి శిక్షణా శిబిరానికి పంపిస్తున్నారు.



సద్వినియోగం చేసుకుంటా..

వేసవి వాలీబాల్ శిక్షణను సద్వినియోగం చేసుకొని మెళకువలను మెరుగుపర్చుకుంటా. వాలీబాల్‌లో అటాకర్‌గా ఆడుతున్నా. ఇటీవలే సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో పాల్గొనగా జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించడం సంతోషంగా ఉంది.
– స్వాతి, మహబూబ్‌నగర్

రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం..



ఏడాదిన్నరగా వాలీబాల్ శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో ఆడా. శిబిరంలో మంచి శిక్షణ ఇస్తున్నారు. మెరుగైన ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం.
– అర్షాత్ బాజివి, మహబూబ్‌నగర్

బాస్కెట్‌బాల్ చాంపియన్ హైదరాబాద్



పురుషుల విన్నర్ హైదరాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

- పురుషుల, మహిళా విభాగాల్లో హవా
- మహిళల రన్నరప్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు
- ముగిసిన అండర్–23 (3గీ3) బాస్కెట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్–23 విభాగం 3గీ3 పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ చాలెంజర్ టోర్నీ గురువారం ముగిసింది. టోర్నీలో పలు జట్లు నువ్వా.. నేనా అనే రీతిలో తలపడ్డాయి. ఫైనల్‌లో హైదరాబాద్ పురుషుల, మహిళల జట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచి చాంపియన్లుగా నిలిచాయి. ఉత్కంఠ పోరులో హైదరాబాద్ పురుషుల జట్టు 14–12 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించింది. అదే విధంగా మహిళల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 21–4 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగం మూడో స్థానంలో హన్మకొండ, మహిళల మూడో స్థానంలో రంగారెడ్డి జట్లు నిలిచాయి. టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులుగా గౌతమ్ (హైదరాబాద్), జాహ్నవి (హైదరాబాద్), ఉత్తమ షూటర్లుగా శ్రీకాంత్ (రంగారెడ్డి), భువనేశ్వరి (మహబూబ్‌నగర్) నిలిచారు.

■ శాట్ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం రూ. 110కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రెండేళ్లలో క్రీడల కోసం రూ. 850కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మహబూబ్‌నగర్‌లో రూ. 2.50కోట్లతో జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ తీసుకొచ్చినట్లు తెలిపారు. దేశంలోనే తెలంగాణను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. టీబీఏ రాష్ట్ర అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయస్థాయికి ఎంపికవుతారని అన్నారు. జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. కాగా, రాష్ట్రస్థాయి అండర్–23 విభాగం 3గీ3 బాస్కెట్‌బాల్ టోర్నీలో 18 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నసరుల్లా హైదర్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ.వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్‌రావు, రిటైర్డ్ పీడీ చెన్న వీరయ్య, సజ్జాద్‌అలీ, సుబాన్‌జీ, మీర్ ఖాలెద్‌అలీ, గీత, ఎండీ ఇలియాజ్, ఫారుఖ్ ముక్రం, బాల్‌రాజు, గోపాలకృష్ణ, ఎండీ షకీల్, సోహెల్, జియావుద్దీన్ పాల్గొన్నారు.

ట్రోఫీలు ప్రదానం

టోర్నీ విన్నర్, రన్నరప్ జట్లకు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. రన్నర్‌గా నిలిచిన జట్టు మళ్లీ గెలవడానికి ప్రయత్నం చేయాలన్నారు.



మహిళల విన్నర్ హైదరాబాద్ జట్టు



మహిళల రన్నర్ మహబూబ్‌నగర్ జట్టు

క్లుప్తంగా

పాముకాటుతో బాలిక మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: పాముకాటుకు గురై బాలిక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని శ్రీపురంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. శ్రీపురం గ్రామానికి చెందిన శ్రీశైలం కూతురు హర్షిత (4) ఇంటి ముందు ఆడుకుంటుండగా పాముకాటు వేసింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు బయటకు వచ్చే లోపు పాప అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే పాపను ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

తెలకపల్లి: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బి నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని రామ్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గెంటిల స్వప్న (38)గురువారం భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన స్వప్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఆమె తల్లి కర్నె ఈదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమెకు భర్త, కుమారుడు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు: ఒకరు దుర్మరణం

వెల్దండ: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణానికి చెందిన నారవోని మల్లేష్(35) వెల్దండలో బంధువుల పెళ్లికి బైక్‌పై వచ్చాడు. అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో మండలంలోని చెర్కూర్ గేట్ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న మల్లేష్ తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతనికి భార్య భాగ్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

ఎర్రవల్లి: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిసిన వివరాల ప్రకారం.. రాజోళి మండలంలోని తుమ్మిళ్ల గ్రామానికి చెందిన కుర్వ వెంకటేశ్వర్లు (62) అదే గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్ దగ్గర కొంత కాలంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన యజమాని కౌలుకు వేసుకున్న పొలం పనులు చేసేందుకు ట్రాక్టర్‌పై కొత్తకోట మండలంలోని జంగమయ్యపల్లికి వెళ్తున్నాడు. జాతీయ రహదారిపై కొట్టం కాలేజీ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని అల్లుడు కుర్వ రామకృష్ణ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

24.728 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి


నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్

ధరూరు/దోమలపెంట/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం సాయంత్రం 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి కోసం 9,446 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1,500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి 11,328 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండగా.. 67 క్యూసెక్కులు ఆవిరి అవుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.261 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ, దిగువలోని 6 యూనిట్ల ద్వారా 24.728 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

శ్రీశైలానికి 9,446 క్యూసెక్కులు

జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ గురువారం 9,446 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 835.5 అడుగుల వద్ద 55.7729 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 867 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 0.842 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి 1,856 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.906 మి. యూనిట్లు ఉత్పత్తి చేసి 1,875 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేశారు.

'బడిబాట'ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

కొత్తకోట: నేటి నుంచి ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. గురువారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు గతేడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 16,80,000 మంది విద్యార్థులు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్నారని, ఒకప్పుడు ఈ సంఖ్య 32లక్షలు ఉండేదని, నేడు గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలిపిన కూడా 23 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం నేటి నుంచి ఈనెల 19 వరకు నిర్వహిస్తుండగా, ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అలాగే మౌళిక సదుపాయాల కల్పన, చాలా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ఖాళీలను భర్తీ చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ పక్షాన శాసనమండలిలో వినిపిస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షులు మోరెడ్డి బౌద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలో భారీ కొండచిలువ


పట్టుకున్న కొండచిలువతో స్నేక్ సొసైటీ సభ్యులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి గ్రామ శివారులో గల సర్వేశ్వర్ రెడ్డికి చెందిన మామిడి తోటలో 15 అడుగుల భారీ కొండచిలువ దర్శనమిచ్చింది. తోటలో పనికి వెళ్లిన కూలీలకు కొండచిలువ కనబడడంతో వెంటనే తోట యజమాని సర్వేశ్వర్ రెడ్డికి విషయాన్ని తెలుపగా ఆయన ఎస్‌ఐ శివకుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఎస్‌ఐ స్నేక్ సొసైటీ నిర్వాహకులు కృష్ణసాగర్‌కు విషయం తెలుపగా అతను వచ్చి కొండ చిలువను పట్టుకున్నారు. కొండచిలువ 15 అడుగుల పొడవు, 30 కిలోల బరువు ఉందని కృష్ణసాగర్ తెలిపారు. పట్టుకున్న కొండచిలువను ఫారెస్ట్ అధికారుల సూచన మేరకు అడవి ప్రాంతంలో వదిలివేస్తామన్నారు. ఎవరికైనా పాములు కనిపిస్తే చంపొద్దని, తనకు సమాచారం ఇస్తే పట్టుకుని అడవిలో వదిలేస్తానన్నారు. ఆయన వెంట స్నేక్ సొసైటీ సభ్యులు ఏర్పుల గోపాల్ యాదవ్, కావలి భాస్కర్, మహబూబ్, మైనుద్దీన్, భాగ్యలక్ష్మి, పెంటన్న, పల్లవి, వనజ, ఫాతిమా, ఉన్నారు.

మొసలి దర్శనం.. భయాందోళనలో ప్రజలు


ఊరచెరువులో కనిపించిన మొసలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఊరు చెరువులో మొసలి కనిపించడంతో స్థానిక రైతులు తీవ్ర భయాందోళనకు గురి అవుతున్నారు. వారం రోజులుగా తరచూ కనిపిస్తుండడంతో రైతులు, పశువుల కాపరులు అటుగా వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాలుడి ప్రతిభ


కాంస్య పతకంతో రిథిన్

మహబూబ్‌నగర్ క్రీడలు: సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు ఎం.రిథిన్ ప్రతిభ చాటాడు. 8 ఏళ్లలోపు బాలుర విభాగంలో 200 మీటర్ల పరుగును 34.4 సెకన్లలో పూర్తి చేసి కాంస్య పతకం సాధించాడు. ఈ క్రమంలో గురువారం జిల్లా కేంద్రంలో రిథిన్‌ను జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షుడు రాజేంద్రకుమార్ శాలువాతో సత్కరించి రూ.1500 నగదు పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర, జడ్చర్ల అథ్లెటిక్స్ కోచ్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

కోయిల్‌కొండ: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందిన ఘటన కోయిల్‌కొండ మండలం కొత్లాబాద్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొత్లాబాద్‌కు చెందిన రైతు దస్తగిరి నర్సింహులు రోజు మాదిరిగానే తన గేదెలను గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో మేపేందుకు తీసుకెళ్లాడు. అక్కడ మేత మేస్తున్న క్రమంలో రెండు గేదెలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న వెటర్నరీ డాక్టర్ సమీర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. రెండు గేదెల విలువ రూ. 2లక్షల వరకు ఉంటుందని.. బాధిత రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



అండర్–19 లీగ్‌లో మహబూబ్‌నగర్ విజయభేరీ


అబ్దుల్ రాఫే (165 పరుగులు)


కిషోర్ (5వికెట్లు)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లా అండర్–19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్‌లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 254 పరుగుల తేడాతో నారాయణపేట జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 343 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్‌రాఫే మరోసారి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 127 బంతుల్లో 3 సిక్స్‌లు, 25 ఫోర్లతో 165 పరుగులు, ప్రణయ్ 52 పరుగులు చేశారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నారాయణపేట జట్టు పాలమూరు బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 31.1 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయింది. పాలమూరు బౌలర్ కిషోర్ 9.1 ఓవర్లలో 36 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీయగా ఇతర బౌలర్లు మనోజ్ యాదవ్ 2, అభినవ్ 2 వికెట్లు తీశారు.

అండర్–19 లీగ్‌లో ప్రతిభచాటాలి

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో అండర్–19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. లీగ్ మ్యాచ్‌ను గెలిచిన మహబూబ్‌నగర్ జట్టును ఆయన అభినందించారు. ఓడినవారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం ఆడాలని కోరారు. అండర్–19 లీగ్‌లో రాణించే క్రీడాకారులను త్వరలో జరిగే హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి టోర్నీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. అండర్–19 లీగ్‌లో క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రదర్శనను చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్‌లు అబ్దుల్లా, మన్నాన్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలని బెదిరింపు కాల్స్

అమరచింత: పట్టణంలోని షాపులకు సంబంధించిన ట్యాక్స్‌లు వెంటనే ఫోన్ పే ద్వారా చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి వ్యాపారస్తులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని మున్సిపల్ కమిషనర్ రవిబాబు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణానికి చెందిన వ్యాపారులు శివశంకర్ రెడ్డి, అఖిల్, తిమ్మారెడ్డి మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి 82476 49631 నంబర్ నుంచి తమకు ఫోన్లు కాల్స్ వస్తున్నాయని తెలిపారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి ఫోన్ చేసి షాపు ట్యాక్స్‌లు కట్టాలని, లేకుంటే తాళాలు వేస్తామని బెదిస్తున్నాడని వాపోయారు. మీరు ఎవరని వ్యాపారులు గుర్తు తెలియని వ్యక్తిని అడిగితే అతడే తాను మున్సిపల్ కమిషనర్‌ను అంటూ దబాయించడంతో ఆందోళన చెందిన వ్యాపారస్తులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీశారు. ఘటన స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ తాను ఎవరికి వ్యక్తిగతంగా కాల్స్ చేయలేదని, ఫోన్ నెంబర్ ఆధారంగా నిందితుడిని పట్టుకోవాలని లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

చెట్టుపై నుంచి కిందపడి గీత కార్మికుడి మృతి

తాడూరు: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి చెందిన ఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సిర్సవాడ గ్రామానికి చెందిన చింతకింది మల్లేష్‌గౌడ్ రోజులాగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. చెట్టుపైకి పూర్తిగా ఎక్కిన తర్వాత అతని నడుముకు కట్టుకున్న మోపు ఊడిపోవడంతో చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. దీంతో వెంటనే అతన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముఉంది. మృతుడికి భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

500 గ్రాముల ఆల్ఫాజోలం పట్టివేత

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో గురువారం కొందరు వ్యక్తులు ఆల్ఫాజోలం మత్తు పదార్థం విక్రయిస్తున్నారని ముందస్తు సమాచారంలో పోలీసులు అక్కడికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ఐజ మండలంలోని బింగిదొడ్డి గ్రామానికి చెందిన నరసింహాగౌడ్, గట్టు మండలంలోని తుమ్మలపల్లికి చెందిన భాస్కర్‌గౌడ్ పెబ్బేరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆల్ఫాజోలం విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని భాస్కర్‌గౌడ్, నరసింహాగౌడ్‌ను అదుపులోకి తీసుకోగా.. మిగిలిన వారు పరారయ్యారు. అదుపులోని తీసుకున్న నరసింహాగౌడ్‌ను విచారించగా కర్నూల్ జిల్లాకు చెందిన హర్షవర్ధన్‌గౌడ్, జగదీశ్‌గౌడ్, గోపాల్‌గౌడ్ అనే ముగ్గురు వ్యక్తుల నుంచి ఆల్ఫాజోలం తీసుకొచ్చి భాస్కర్‌గౌడ్ ఇస్తున్నాడని తెలిపాడు. భాస్కర్‌గౌడ్ కల్లు దుకాణాలకు నడుపుతున్న అనంతపురం జిల్లాకు చెందిన కుమార్‌గౌడ్, కర్నూల్ జిల్లాకు చెందిన లక్ష్మన్నగౌడ్, పండ్ల రమేష్, గజేంద్రగౌడ్, నాగర్‌కర్నూల్ చెందిన యుగంధర్‌గౌడ్‌లకు విక్రయిస్తున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి 500 గ్రాముల ఆల్ఫాజోలం స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.